క్లుప్తంగా

'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' రేపు

కొయ్యూరు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు పాడేరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు హాజరుకానున్నట్లు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రమాద బీమాపై అవగాహన


మాట్లాడుతున్న బీఎం సతీష్‌కుమార్

కొయ్యూరు: మండలంలోని మంప పంచాయతీ గంగవరంలో గ్రామీణ బ్యాంకు మేనేజర్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు తప్పనిసరిగా బీమా కలిగి ఉండాలని సూచించారు. బీమా వల్ల ప్రమాద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పీఎంజేజేబీవై, ఎస్‌బీవై, ఏపీవైల గురించి వివరించారు. బ్యాంకు మిత్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి


మాట్లాడుతున్న ఏవో చక్రధర్

రాజవొమ్మంగి: ప్రతి రైతు పీఎం కిసాన్‌కు చెంది ఈకేవైసీ అలాగే ఎన్‌పీసీఐ అనుసంధానం చేయించుకోవాలని రాజవొమ్మంగి వ్యవసాయాధికారి చక్రధర్ కోరారు. చేయించుకోని వారు అన్నదాత సుఖీభవ తదితర రైతు సంక్షేమ పథకాలు పొందలేని పరిస్థితి ఉంటుందన్నారు. మండలంలోని దూసరపాము గ్రామంలో రైతు సదస్సు కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని సూచించారు. సర్పంచ్ చీడి శివ, ఎంపీడీసీ సభ్యులు గొల్లపూడి పెద్దిరాజు, సత్యనారాయణ, వీఏఏ సాయి భరద్వాజ్, శివ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన


మాట్లాడుతున్న ఏడీఏ తిరుమల

చింతపల్లి: గంజాయికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసేలా రైతుల్లో అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు (ఏడీఏ) బి.వి.తిరుమల గురువారం వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈవోలకు సూచించారు. వారితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అలసత్వం చేయకండా ఈ- పంట నమోదు చేయాలన్నారు. గిరిజన రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను సేకరించాలన్నారు. గంజాయి పండించకుండా ఆదాయం వచ్చే పంటలపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఏవో మధుసూధన్‌రావు, ఏఎస్ఓ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

శరభన్నపాలెంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బీజేపీ నేతలు

కొయ్యూరు: మండలంలోని శరభన్నపాలెంలో బీజేపీ నాయకుడు లోకులగాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఎల్‌టీ అజయ్ ఆధ్వర్యంలో ఉచితంగా సికిల్ ఎనీమియా పరీక్షలను నిర్వహించారు. బీజేపీ నాయకులు పరమేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు లోకులగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. పలువురు మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతి కోసం లోకులగాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఎంఈవో సత్యనారాయణ, నాయకులు శివకుమార్, పద్మరాజు, రామదాసు, సూరిబాబు, చిట్టిబాబు, లోకులగాంధీ కుటుంబ సభ్యులు కిరణ్‌మాస్టర్, రమేష్ పాల్గొన్నారు.

సంతలో సమస్యల చింత


గుత్తులపుట్టు వారపు సంతలో తాత్కాలిక షెడ్లు


శిథిలావస్థలో వ్యాపార సముదాయం

- నిరుపయోగంగా సంత షెడ్లు
- కబ్జాలకు గురవుతున్న సంత స్థలం
- పట్టించుకోని అధికారులు

పాడేరు రూరల్: మండలంలో గుత్తులపుట్టు వారపు సంత సమస్యల చింతగా మారింది. ఈ సంత విస్తీర్ణం సుమారు 3 ఎకరాల్లో ఏర్పాటైంది. కొంతమంది గిరిజనేతరులు స్థలాన్ని అక్రమించడంతో వారపు సంత స్థలం నిర్వహణ కష్టతరంగా మారింది. వారపు సంతలో అరకొర సదుపాయాలు దర్శనమిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వారపు సంతకు వస్తున్న రైతులు, వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వారపు సంతలో సమస్యలపై తీవ్ర నిర్లక్ష్యం చేస్తుండడంతో అధ్వానంగా మారింది, వర్షకాలంలో సంత మార్కెట్ చిత్తడిగా మారి అడుగు తీసి అడుగు వేసేందుకు వీలు లేకుండా పోతుందని స్థానికులు చెబుతున్నారు. సంతలో సీసీ రోడ్డు కరువైంది. రోడ్డుపైనే వ్యాపార దుకాణాలు ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య తలేత్తుతోంది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది, రోడ్డు దాటలంటేనే గంటల తరబడి సమయం పడుతుంది.

కనీస సౌకర్యాలు కరువు

వారపు సంతలో కనీస సౌకార్యలు లేవు. తాగునీరు, మరుగుదొడ్లు లేక వారపు సంతకు వస్తున్న కొనుగోలుదారులు, వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరాల కోసం మహిళలు మైళ్ల దూరం వెళ్లాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు. లక్షలాది రూపాయల ఆశీలు వస్తున్నా సంతల్లో కనీస సదుపాయాల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంతల్లో సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


వినియోగంలో లేని షెడ్లు


నిరుపయోగంగా మార్కెట్‌యార్డు

శిథిలావస్థలో మార్కెట్ యార్డు

వారపు సంతలో గతంలో నిర్మించిన మార్కెట్ యార్డులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాకాలంలో నిత్యావసర సరుకులు, వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు వీలు లేకుండా పోయింది. సరైన సదుపాయం కూడా లేకపోవడంతో వ్యవసాయ ఉత్పత్తులను భద్రపరిచేందుకు కష్టతరంగా మారిందని వ్యాపారస్తులు అంటున్నారు, వారపు సంత రోజు రోడ్లపైనే చిరు వ్యాపారాస్తులు దుకాణాలు ఏర్పాటుతో వాహనాదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి తప్పడం లేదని స్థానికులు చెబుతున్నారు, ఎటు చూసిన వారపు సంతకు సంబంధించిన స్థలాలు కబ్జాకు గురైయ్యాయని, అధికారులు,చోరవ తీసుకొని స్థలాలను పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు,

వ్యాపార సముదాయాలు నిర్మించాలి



వారపు సంతలో అవసరమైన వ్యాపార సముదాయాలు నిర్మించాలి. ప్రస్తుతం సంతలో ఉన్న వ్యాపార సముదాయాలు శిథిలావస్థకు చేరాయి. కర్రలతో తాత్కలికంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలో వ్యాపారాలు నిర్వహిస్తున్నాం. వర్షాకాలంలో మరింత ఇబ్బందులు పడుతున్నాం.

– గొల్లోరి రామన్న, చిరు వ్యాపారి, సంతబయలు, పాడేరు మండలం

స్థలాన్ని రక్షించండి



సంత స్థలాలను పరిరక్షించాలి. స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. దీనిపై గతంలో కలెక్టర్ , రెవెన్యూ పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేశాం.అయినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కబ్జాలకు గురైన స్థలాలను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి,

– చిన్నయ్య, గుత్తులపుట్టు సంతబయలు గ్రామం, స్థానికుడు, పాడేరు మండలం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

పంచాయతీ తీర్మానం చేస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం, వారపు సంత పరిరక్షణ అందరి బాధ్యత. గ్రామ పంచాయతీ తీర్మాణం చేస్తే అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం,

– తేజరతన్, ఎంపీడీవో, పాడేరు, అల్లూరి జిల్లా

ఏడు ఎన్‌ఆర్‌ఎస్‌టీ కేంద్రాలు మంజూరు

కొయ్యూరు: నాన్ రెసిడెన్షియల్ స్కూల్ టీచర్ కేంద్రాలు మండలానికి ఏడు మంజూరయ్యాయి. విద్యార్థులు ఎక్కువగా ఉండి బదులు లేనిచోట్ల వాటిని ఏర్పాటు చేస్తారు. బూదరాళ్ల పంచాయతీలో పిట్లపాడు, పలకజీడి పంచాయతీ గొందికోట, లయలపాలెం ప్రాంతాల్లో ఎన్‌ఆర్‌ఎస్‌టీసికి అనుమతి ఇవ్వలేదు. జాజులబంద, కాకులమామిడి, కొమ్మనూరు, బద్దమామిడిలంక, పుట్టకోట, ఈదులబంద, గంపరాయి గ్రామాలకు ఎన్‌ఆర్‌ఎస్‌టీ కేంద్రాలను మంజూరు చేశారు. దరఖాస్తులు చేసుకున్న వారిని మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారని ఎంఈవో రాంబాబు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

– అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



హుకుంపేట: వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, గిరిజనులు జాగ్రత్త లు పాటించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల న్నారు. అనారోగ్యమైతే వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందాలని సూచించారు.

8న అడ్డతీగలలో శ్రీనివాస కల్యాణం

అడ్డతీగల: తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే పవనగిరి క్షేత్రం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8 న శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు.అడ్డతీగలలోని సోమాలమ్మ అమ్మవారి ఆలయ మైదానంలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం జరగనున్నట్టు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొవాలని కోరారు.

సికిల్‌సెల్ ఎనీమియా జన్యు పరీక్ష కేంద్రం ఏర్పాటుపై హర్షం


హర్షం వ్యక్తం చేస్తున్న బాలల హక్కుల ఫోరం జిల్లా కన్వీనర్ లవకుశ

పాడేరు రూరల్: విశాఖపట్నం కేజీహెచ్‌లో ప్రత్యేక సికిల్‌సెల్ ఎనీమియా జన్యు పరీక్ష కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం అభినందనియమని బాలల హక్కుల జిల్లా ఫోరం కన్వీనర్ బాకా లవకుశ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తుల సౌకార్యర్థం విశాఖపట్నం కేజీహెచ్‌లో ప్రత్యేక పరీక్ష కేంద్రం నిర్మాణానికి రూ.4 కోట్లు నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. నిరుపేద గిరిజనులు సికిల్‌సెల్ ఎనీమియాతో అవసరమైన సేవలందక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నరన్నారు. త్వరలో అందుబాటులో వస్తున్న సికిల్‌సెల్ జన్యు పరీక్ష కేంద్రంతో అన్ని వర్గాల వ్యాధిగ్రస్తులకు మరింత ఉపయోగం ఉంటుందన్నారు.

త్వరితగతిన బూత్ కమిటీల ఎంపిక


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డుంబ్రిగుడ: అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు మండలంలోని వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీల ఎంపిక త్వరితగతిన పూర్తి చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పరశురామ్, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు చెప్పారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 25వ తేదీలోగా కమిటీ ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. పోతంగి, గుంటసీమ సర్పంచ్‌లు వి.వెంకటరావు, గుమ్మ నాగేశ్వరరావు, తూటంగి ఎంపీటీసీ సభ్యుడు రామరావు, పోతంగి వైస్ సర్పంచ్ శెట్టి జగ్గునాయుడు, నాయకులు శ్రీరాములు, సద్దు, శంకర్, తుమ్‌నాథ్, కృష్ణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం


వంజరి సచివాలయంలో బదిలీపై వెళ్తున్న సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న సర్పంచ్ రవని, ఎంపీటీసీ మధు, వైఎస్సార్‌సీపీ నాయకులు

జి.మాడుగుల: మండలంలో వంజరి సచివాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సచివాలయ ఉద్యోగులకు గురువారం సర్పంచ్ రవని, ఎంపీటీసీ మధు,మాజీ సర్పంచ్ వంజరి సీతారాం నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గిరిజన ఐక్య వేదిక జిల్లా సహాయ కార్యదర్శి కొండపల్లి మత్స్యరాజు శాలువలు కప్పి మెమోంట్‌లు అందించి ఘనంగా సన్మానించారు. నూతన సచివాలయ కార్యదర్శి చైతన్య, సిబ్బందిని, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, నూతనంగా బదిలీపై వచ్చిన సిబ్బందిని శాలువలతో సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి చిన్నంనాయుడు, నాయకులు వెంకటరమణ, శివన్నారాయణ, చిరంజీవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న సీఐటీయూ చిన్నయ్య పడాల్

చింతపల్లి: సంక్షేమ హాస్టల్స్‌లో పనిచేస్తున్న వర్కర్లు, స్వీపర్లకు తక్షణమే పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం హాస్టల్స్‌ను సందర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న క్యాజువల్ డైలీవేజ్, ఔట్‌సోరింగ్, స్వీపర్లకు మూడు నెలల నుంచి జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేతన బకాయిలు త్వరగా చెల్లించాలని లేని పక్షంలో ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి


మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటరావు తదితరులు

డుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతంలో స్థానిక పోతంగి పంచాయతీ గిరిజన యువతకు మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పోతంగి పంచాయతీ సర్పంచ్, వంతల వెంకటరావు, వైస్ సర్పంచ్ శెట్టి జగ్గునాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ జలపాతం నిర్వహణను ఐటీడీఏ అధికారులు విలీనం చేశారని, ఈ మేరకు స్థానిక యువతకు ఇక్కడ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అధికారులు ఇచ్చిన హామీ నేటి వరకు అమలుకావడం లేదన్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి చాపరాయిలో స్థానిక నిరుద్యోగ గిరిజన యువతకు అవకాశాలు కల్పించాలి లేని పక్షంలో ఆందోళన కార్యక్రమలు చేస్తామని వారు హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్, రామునాయుడు, బబీత, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి పండగ


ఊరేగింపులో భక్తులు

రాజవొమ్మంగి: అప్పలరాజుపేటలో మరిడమ్మ తల్లి పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. రోజంతా ఉపవాసం ఉన్న చిన్నారుల తలపై ఘటాన్ని (గరగను) ఉంచి అమ్మవారి ఆలయం వరకు డప్పు వాయిద్యాల నడుమ, సందడిగా ఊరేగింపుగా తీసుకొనివెళ్లారు. భక్తులు మొక్కులు తీర్చుకొన్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకోవడంతో పూజాకార్యక్రమాలు ముగిశాయి. రాత్రి 9గంటల వరకు వేడుక జరిగింది.

దారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని వినతి


పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం అందజేస్తున్న మండల సాధన కమిటీ సభ్యులు

సీలేరు: జీకే వీధి మండలం దారకొండ మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మండల సాధన కమిటీ సభ్యులు వివిధ పార్టీ నాయకులను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును గురువారం వారు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రం వెళ్లేందుకు 200లకు పైగా గ్రామస్తులు సుమారు 60 కిలోమీటర్ల దూరంలోని ఘాట్ మార్గం మీదుగా వెళ్లాల్సి వస్తోందన్నారు. దారకొండ అన్ని ప్రాంతాలకు దగ్గరగా ఉంటుందని, ఈ మేరకు మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు. అనంతరం వారు జేసీ అభిషేక్ గౌడ తదితరులకు వినతిపత్రాలు అందజేశారు. సర్పంచ్‌లు దుర్జో, కమలమ్మ, కుమారి, నాయకులు తదితరులున్నారు.

ఆదివాసీలకు న్యాయం చేయాలి


మాట్లాడుతున్న అబ్బాయిదొర

గంగవరం : ప్రస్తుతం అల్లూరి జిల్లాలోని కొనసాగుతున్న రంపచోడవరం నియోజకవర్గాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే ఉంచాలని, రాజమండ్రి జిల్లాలో కలపవద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ గంగవరం మండల అధ్యక్షుడు కంగాల అబ్బాయి దొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గంగవరంలో గురువారం నిర్వహించిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజనలో ఆదివాసీలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఆదివాసీలంతా ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. ఆదివాసి చట్టాలు సరిగా అమలు కాక ఒక పక్క ఉద్యోగ, ఉపాధి జీవోలు కోల్పోతున్నారన్నారు. ప్రత్యేక ఆదివాసి జిల్లాతోనైనా ఆదివాసి చట్టాలు అమలు నోచుకుంటాయని, రంపచోడవరం నియోజకవర్గాన్ని రాజమండ్రిలో కలిపే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. నాయకులు ప్రదీప్ కుమార్ దొర, సత్తిబాబు, ఏడుకొండలు, ప్రసాద్ దొర పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ


మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మట్టి వినాయక ప్రతిమిలను ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో చేసిన విగ్రహాల వల్ల జలవనరులు కాలుష్యమవుతాయన్నారు. అందువల్ల మట్టి వినాయక విగ్రహాలను పూజించాలన్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడాలని కోరారు. వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీఓలు వై.విజయలక్ష్మి, ఎం.అనిత కుమారి, అధ్యాపకులు గణేష్, ఎస్.రాజు, సోంబాబు, ఎస్. సురేష్, కళాశాల సిబ్బంది శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్ కుమార్, ఎస్.వెంకటరమణ, డి.అప్పన్న, రామన్న, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


గొందివలసలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది


తునికిచెరువులో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రా పంచాయతీ గొందివలస గ్రామంలో గురువారం వైద్యధికారి పి.రాంబాబు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆ గ్రామంలో అనారోగ్యంతో ఉన్న 18 మంది చిన్నారులకు, 22 మంది పెద్దలకు సుమారు 40 మందికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, ఎవరికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన తక్షణమే వైద్యసిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు. హెల్త్ అసిస్టెంట్ లావరాజు, ఎం.ఎల్.హెచ్‌పీ పుష్ప, ఏఎన్ఎం సుమాంజలి, కొర్రా వైస్ సర్పంచ్ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: తుపాను, వరదల కారణంగా ప్రబలే అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నెల్లిపాక పీహెచ్‌సీ వైద్యుడు దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని తునికిచెరువు గ్రామంలో గురువారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వరపీడుతుల రక్త నమూనాలు సేకరించి మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు చేసి బాధితులకు తక్షణ వైద్యం అందించారు. అనంతరం ఇంటింటా ఫీవర్ సర్వే చేసి పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్‌వి వాణి, ఎల్‌టి దుర్గ, ఏఎన్ఎం శ్రీదేవి,సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన


సూపర్‌వైజర్లకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నేతలు


చింతూరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


గంగవరంలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ముంచంగిపుట్టు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఆర్ఎస్ (ఫేజ్ రికగ్నైజ్డ్ యాప్)ను రద్దు చేయాలని, అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం అమలుచేయాలని సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ అండ్ హెల్పర్స్ యూనియన్ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని, యాప్‌ల ప్రక్రియను తొలగించాలని, బకాయి వేతనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అంగన్‌వాడీల జీతాలు పెంచాలన్నారు. నాయకులు శంకరరావు, ఈశ్వరి, మౌలమ్మ, భవాని, వెంకట్, సురేష్, సూకరత్నం, భద్రమ్మ, రాణి, రమణమ్మ, బేబీరాణి పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు


వివరాలు పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ సచివాలయంలో గురువారం వైస్ ఎంపీపీ భాగ్యవతి సందర్శించారు. వీఆర్‌వో విజయలక్ష్మీతో మాట్లాడి అన్నదాత సుఖీభవ మంజూరులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా సుఖీభవ డబ్బులు జమ చేయాలన్నారు.ఈ సందర్భంగా వైస్ఎంపీపీ భాగ్యవతి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులందరికీ రైతు భరోసా పథకం వర్తించిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో అందరికీ అన్నదాత సుఖీభవ పథకం అమలుచేయకుండా ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. అర్హులందరికీ పథకం అమలుచేయాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నీలకంఠం, సిద్దేశ్, రైతులు పాల్గొన్నారు.